కథానిక

# రెండో తరం ప్రణయం

చాగంటి సోమయాజులు.

తల్లి ఎలాటిదైతే పిల్ల అలాంటిది ఔతుందని అనడం పరిపాటి అయింది. తల్లి ప్రవర్తన కాని చెడ్డదైందా పిల్లకూడా అదే అలవాటు చేసుకుంటుందని లోకమంటుంది. ఇందులో సత్యం కొంతమాత్రం ఉండడానికే అవకాశం ఉంది. ఒకవేళ పిల్ల మంచిదే అయినా తల్లి సంపాదించిన అపకీర్తి మూలంగా పిల్లకీ కళంకం తెస్తుంది. అంబుజవల్లి స్థితి అలాంటిదే అయింది.

అంబుజవల్లి శ్యామవర్ణంలో చలాకైన పిల్ల. నేత్రాలు రెండూ రెండు తెలితామర రేకులే. నల్ల గుడ్లు అందుకు అనుగుణంగా తుమ్మెదలే. పెద్ద గౌరవ మర్యాదలకి ఆలవాలమైన వర్గానికి చెందినవాళ్ళే. కాని తల్లి చిన్నప్పుడు మంచిది కాదని లోకం వేలుపెట్టి చూపెట్టేసింది. అది కాపరం మొగుడితో చిన్నగా చెయ్యలేదు. రెండుసార్లు లేచిపోయింది. అత్తారింట్లో-మొగుడింట్లో వుండగానే పోయేకాలం బుద్ధులుపుట్టేయి. అయినా ఆ మొగణ్ణి మెచ్చుకోవాలి. రెండుసార్లు లేచిపోయిన పెళ్ళాన్ని తిరిగి ఇంట్లో పెట్టుకుని ఏలుకున్నాడంటే సామాన్యమైనవిషయమా! ఇంటిలో ఉంచుకున్నాడు. కాపరం తరవాత తరవాత అన్ని అనుభవాలూ అవిడగారికైనాక స్థిరపడ్డవి. పిల్లలు కలిగారు, బాగున్నారు. చుట్టూ ఉన్న ఎవ్వరూ ఆవిడ చిన్నప్పటి ముచ్చటలు ఎరగనే ఎరగరు. కాని బంధువర్గమంతా ఎరుగుదురు. వాళ్ళకి జ్ఞాపకశక్తి జాస్తి. జాగ్రత్తగా ఆవిడ వివరాలన్నీ నిన్న మొన్న జరిగినట్టు తవ్వి ఎక్కలాగి మరీ చెప్తూవుంటారు; విత్తనం ఒకటివేస్తే మొక్క ఇంకొకటి పుడుతుందా? అనేది వాళ్ళ వాదం.

అంచేత అంబుజవల్లికి పెళ్ళి కావడం దుర్ఘటమై పోయింది. పైగా వాళ్ళవర్గం సామాన్యమైన వర్గం కాదు. అంతా జమీందారీ ఫాయా. అంతా పెద్దపెద్ద భూస్వాములూ మీసాలు మెలిపెట్టి పౌరుషానికి పోయేవాళ్లు. ఆడపిల్లకి పెళ్ళి చెయ్యడం వాళ్ళల్లో ఇళ్లు కట్టడంలాంటిదే. అంబుజవల్లితండ్రి సామాన్యమైన సంసారి. చిన్న ఉద్యోగస్థుడు. ధనాభావం చేతా, తల్లి పూర్వ ప్రవర్తనవల్లా కూడా అంబుజవల్లి పెళ్ళి సమస్య గడ్డు సమస్య అయికూచుంది.

ఈడొచ్చిన పిల్ల వాస్తవంగా ఘోషాలో ఉండవలసిన కుటుంబానికి చెందిన పిల్లా అయి వస్తాను ఎక్కడైనా వీధిలో పెట్టుకుంటారా! పెళ్ళి ప్రయత్నాలు భగ్నమౌతూ ఉంటే, ప్రయత్నం మళ్లామళ్లా చేస్తూ ఇంట్లో నాలుగు గోడలమధ్యా ఉంచాలి కాని ఆడపిల్లని బజార్లోకి వెళ్ళనుంటారా? అంబుజవల్లి తండ్రి అంతే చేశాడు. స్వేచ్ఛగా పెళ్ళి చెయ్యమంది మొగపిల్లలమధ్య హైస్కూల్లో చదువుకోమన్నాడు! తరవాతకూడా పెళ్లికాకపోతే నలుగు రమ్మాయిలూ వెళుతున్నారనీ కాలేజీలో కూడా ప్రవేశపెట్టాడు. బాగా యుక్తవయస్సొచ్చింది. తుమ్మెదల్లాగ కళ్లు కదులుతున్నాయి కదా కాలేజీకి పంపుతారా?

బ్రాహ్మణులంతా తమ ఆడపిల్లల్ని కాలేజీలకి పంపేరంటే వాళ్లు ఏనాడో చెడ్డారు. ఇహ కమ్మవారు వారి ఆడపిల్లల్ని బ్రాహ్మణేతరులలో పంపుతున్నారంటే వాళ్లు బొత్తిగా బ్రాహ్మణులకన్నా చెడి కమ్మవారేమిటి కమ్యూనిస్టులే అయిపోయారు. వాళ్ళంతా వాతలు పెట్టుకుంటే వాడూ పెట్టుకోవాలా! అందులో మచ్చకూడా ఉన్నవాడు ఈ పనికి సాహసించడం కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ఇష్టం లేదు.

అంబుజవల్లి కాలేజీలో ప్రవేశించి చలాకీగా చదువుతున్నది. అంతా బాగానే వెళ్లింది. దానికి సంప్రదాయానికి విరుద్ధమైన భావాలన్నీ అంటుకున్నాయి. అయినా చక్కగా బోధపర్చుకొని

జీర్ణం చేసుకొన్నా ఫరవాలేదు. మిడిమిడి జ్ఞానంతో ఎన్నడూ ఆలోచించకూడని భావాలు నెత్తికెక్కాయి. అంబుజవల్లి తన పెళ్లి మాట ఎత్తితే తల్లికీ తండ్రికీ ఒక్క విషయం చెప్పింది. మన బంధువులంతా మనని బహిష్కరించారు. కులంవాళ్లలో సంబంధం నాకు కుదురుతుందన్న ఆశ మీకు లేనేలేదు. పోనీ ఏ కులమైతేనేమి, శుభ్రమైనవాణ్ణి ఇంకో వర్ణంలోంచి ఎందుకు పెళ్లాడకూడదూ అని అడిగింది. దానికి దాని తల్లి తండ్రులు అంగీకరించలేదు. వాళ్ల సంస్కారం అంతదాకా వెళ్ళలేదు.

అంబుజవల్లి స్నేహితురాలు ఒకత్తె కాలేజీలో ఉన్నది విచిత్రమైన పెళ్ళాడింది. ఆ పెళ్ళికి అది వెళ్ళలేదు కాని జరిగిన విధమంతా వింది. ఆ పిల్ల కాలేజీలో ఉన్న కుర్రాణ్ణి దానంతటది ప్రేమించి ఉంది. వాళ్ళిద్దరూ పెళ్ళాడదామంటే పెళ్ళాడదామని నిశ్చయించుకున్నారు. లాడ్జిలో పెళ్ళాడేశారు. అటు దాని తల్లి దండ్రులుకాని ఇటు వాడి తలిదండ్రులుకాని ఎరగరు. ఇద్దరూ ఒక వర్గంవారు కారు. ఒక ఊరు వారు కారు. ఐతే ఇది ఎందుకు జరిగిందో అంబుజవల్లికి తెలియదు. అసలు అంతర్యం వేరే ఉంది. ఆ పిల్లా పిల్లాడుకూడా సోషలిస్టు సహవాసాలకి పోయి చెడ్డారు. సోషలిస్టులుకూడా పేరులో మార్పుకాని కమ్యూనిస్టులాగే చీడపురుగులు. వాళ్ళ బుద్ధులన్నీ పెడమార్గాన్నే ఉంటాయి. ఈ అంతర్యం తెలియక ఆ పెళ్ళి కావడం అంబుజవల్లి బుద్ధంతా పొరపాటయిపోయింది. దాని బుర్రంతా ఆ ఆలోచనలో పడిపోయింది. అది సులభ సాధ్యమైనదని దానికి తోచింది. ఎందుకు కూడదూ అని తోచింది. ఎంచేతంటే కాలేజీలో కుర్రాళ్ళలో చాలామంది దానికోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సంతకాలు పెట్టినవీ పెట్టనివీ ఎన్నో ఉత్తరాలు వస్తూ ఉంటాయి. ఈరకం ఉత్తరాలు ప్రతీ పిల్లపేరా కాలేజీల్లో ఎన్నో వస్తాయి. సర్వసాధారణంగా వాళ్ళ కాలేజీలో ఆ ఉత్తరాలు ఆడపిల్లల గదిలో చూడకుండానే చింపి పారేస్తూ ఉంటారు. అంబుజవల్లి మాత్రం ఉత్తరాలన్నీ చదివి తనని అంతమంది వలచి వున్నారు కదా అని గర్వపడుతూ సంతోషించేది.

పైగా మొగపిల్లలు ఎవరెవరు తనపై కన్ను వేసి ఉన్నారో ఎరుగును. వాళ్లలో రౌడీలెవరో సాత్వికులెవరో దానికి స్పష్టంగా తెలుసు. సాత్వికుల్లో జమకట్టవలసిన వాళ్లలోనూ దగుల్బాజీలుంటారు, మెత్తమెత్తగా కనబడుతూ ఉన్నవాళ్లుకూడా కాస్త వీలైనప్పుడు ఆడపిల్లలమీద చిన్న అల్లరి చేస్తారు. అంబుజవల్లి మొగపిల్లల స్వభావాలన్నీ వాడి వడబోస్తూ ఒక కుర్రాణ్ణి మాత్రం అందరిలోకీ వేరుచేసింది. ఆ వేరుచేసిన కుర్రవాడు మధుసూదనరావు.

మధుసూదనరావు తన క్లాసే చదువుతున్నాడు. ఏవరేజికన్నా కాస్త పైన తెలివితేటలున్నవాడే. ఐనా బాగా బిడియంగా ఉంటాడు. కుర్రవాళ్లందరి చూపులకన్నా వాడి చూపులు అంబుజవల్లికి తీక్షణంగా ఉంటాయి. వెంటనే లజ్జపడిపోతాడు. పొరపాటు చేసినట్టు మొహం ఎందబెట్టుకుంటాడు. దగ్గర పడ్డప్పుడల్లా బహు మర్యాదగా ప్రవర్తిస్తాడు. వాడు అంబుజవల్లిని మనసులో ఆరాధన చేస్తున్నాడు. దానికి ఏమీ అభ్యంతరం లేదు. ఈ సంగతులన్నీ కేవలం స్త్రీకి సహజమైన జ్ఞానంతో పోల్చుకొన్నది.

తల్లితండ్రీ వద్దన్నా దాని మనసుమాత్రం మధుసూదనరావుమీద గంపెడాశ పెట్టుకుంది. వాణ్ణి అదే భావంతో చూడ్డం కూడదు కాబోలునని అనుకొంటున్నా వాడు కనబడగానే ఆప్యాయతగా చూడ్డం మనస్సుకి సంతృప్తి ఇవ్వడం ప్రారంభించింది. వాడుమాత్రం అల్లరచిల్లర పనులేవీ మిగతా వాళ్లలాగ చేసేవాడు కాదు. పక్కగానున్నా పక్షెత్తుమాట ఆడేవాడు కాదు. వాడు ఎంత మమకారంతో దాన్ని చూస్తాడో అంత దూరదూరంగా పోతూఉంటాడు.

అంబుజవల్లి తనతోటి సోషలిస్టు విద్యార్థిని చేసినపని చూశాక ధైర్యం చేసింది. అదే చక్కగా తెగించింది. లెబరేటరీలో కాస్త ఒంటరిగా కుర్రాణ్ణి కలియడానికి అవకాశం ఉంటుంది కాదూ? అక్కడ వాడు దానికి దొరికాడు.

'మధుసూదనరావుగారూ' అని పిలిచింది.

'ఏమండీ!' అని వాడూ పలకరించాడు.

'మీ కాలుకు కెమిస్ట్రీ నోట్సు నా కొకసారి ఇస్తారా? రాసుకొని ఇచ్చేస్తాను' అన్నాది.

'ఎవరైనా చూస్తే లేనిపోని పేర్లు పెడతారండీ' అని అన్నాడు. వాడు తబ్బిబ్బైపోతున్నాడు.

'ఫరవాలేదు. మాయింటికి రేపు సాయంత్రం ఇవ్వండి' అన్నాది. వాడే జవాబూ చెప్పకండానే తాను వెళ్లిపోయింది.

ఇంటికి తెమ్మంటే అభ్యంతరం ఏముంది? నగౌరవంగానే ఉంటుంది. మధుసూదనరావు సహజంగా సిగ్గరే అయినా మర్నాడు సాయంకాలం వాళ్లింటికి చంకలో నోట్సు పట్టుకొని వెళ్ళాడు. వాడికి దాని ఇల్లు తెలుసు! కనిపెట్టే ఉన్నాడు. ఆ వీధిలోకి వెళ్లినదగ్గరనుంచి వాడికి లేళ్లూ జెర్రులూ పాకుతున్నట్టుంది. భయపడుతూనే అడుగులు వేస్తున్నాడు. వాళ్లగుమ్మం దగ్గర ఎవ్వరూ లేరు. అంబుజవల్లిగారూ అనిపిలుద్దామని సంకల్పించుకొన్నాడు. కాని అంబుజవల్లి వాడు వీధిలో అడుగుపెట్టడం చూసే లోపలికెళ్లి కుర్చీలో కూచుంది. కిటికీలోంచి వీధి చూస్తున్నది. వాడు కిటకీ దగ్గరకొచ్చి ఏమిచెయ్యాలో తెలియక సందిగ్ధంలో పడుతున్నాడు. అది వీధిలోకొచ్చింది.

'ఏమండీ తెచ్చారా... థేంక్సు' అని చేతిలోంచి అందుకొంది.

'నాకు మళ్లా ఎప్పుడిస్తారు?' అన్నాడు.

'రేపుసాయంకాలం ఇదేవేళకొచ్చి తీసుకుపొండి. మీకు చాలా శ్రమపెడుతున్నాను' అంది.

'ఫరవాలేదండి. ఎవరైనా చూస్తే ఏమనుకొంటారో అని భయం. అంతకన్నా మరేం లేదు' అన్నాడు.

'మాయింటికొస్తే తప్పా?' అంది.

'తప్పుకాదు లెండి. అయినా మిగతా వాళ్ళు—'

'మిగతావాళ్ళతో మనకేంపని?' అన్నది.

'వస్తానండి' అని గబగబ తప్పుచేసినవాడిలాగ తప్పటడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

అంబుజవల్లికి తెలుసు. సాయంకాలం వాళ్ళ నాన్న ఉండడు. వాళ్ళమ్మ వండుకొంటూ వంటింట్లో ఉంటుంది. మిగతావాళ్ళు పిల్లలు. వాళ్ళకెలాగైనా సమాధానం చెప్పి బుజ్జగించవచ్చును. అందుకు ఎత్తు ఎత్తింది.

మధుసూధనరావు రావడం మొదలెట్టిన తరవాత రోజూ ఇంచుమించు రావలసి వచ్చేది. ఏదో ఒక పుస్తకం ఒక రోజు తెచ్చి ఇవ్వాలి. రెండోరోజు తీసికెళ్లాలి. మూడోరోజు మరొకటి తేవాలి. మాటలు మాత్రం ముక్తసరిగా మర్యాదగానే ఉంటున్నాయి. శ్రుతిమించి రాగాన్నపడే ప్రవర్తన ఇద్దరిలోనూ లేదు. కాలేజీలో మాత్రం వాళ్ళల్లో పెద్ద మార్పు వచ్చింది. ఒకొర్నొకరు ధైర్యంగా చూసుకుంటారు. చూపులలో పూర్వపులాగ కాక ఇప్పుడు ఇద్దరికీ ఏకాభిప్రాయమున్నట్టు స్పష్టమైపోయింది.

ఎప్పుడైనా మొగవాడు బైటపడతాడు కాని ఆడది బైటపడదు. మధుసూదనరావుకు ఆవిషయం తెలుసు. వాడు ఎంత మథనపడ్డా నిబ్బరం లేనివాడైపోయాడు. నోటి చివరిదాకా ఏమని ప్రారంభించాలో వెయ్యిసార్లు ఏకాంతంగా రిహార్సలు చేసుకొని వెళ్ళి కూడా నోరురాక ఊరుకొన్నాడు. అంబుజవల్లి అంతా కనిపెడుతున్నా ఎక్కడా తేలలేదు. పుస్తకాలని పురమాయిస్తూ ఉండడం మానలేదు. ఒకనాడు అంది :

'ఏమండీ, మీరు చాలా మర్యాదస్తులండీ. కాలేజీలో కుర్రాళ్ళంతా ఉత్తి వెధవలు. నానా అల్లరా పెడుతున్నారు. వాళ్ళని చూస్తే చెప్పుచ్చుకుని ఒక్కొక్కర్నీ కొట్టాలనిఉంది' అన్నాది.




'ఇప్పుడంతా అలాగే వున్నారండి, దానికి మనమేం చెయ్యలేము.' అని పుస్తకం తెచ్చింది ఇచ్చి 'ఏమండి అందులో విడికాయితాలు ఉన్నాయి, రాలిపోకండా ఉంచండి' అని చెప్పి వెళ్ళిపోయింది.

అందులో ఆరు విడి కాయితాలు ఉన్నాయి. అందులో పన్నెండు పేజీలమీదా రాసి ఉత్తరం ఉన్నది. వాడి పుట్టుపూర్వోత్తరాల దగ్గర నుంచి స్థితిగతులదాకా సర్వం రాసిఉంది. ఆఖర్ని అతిమర్యాదగా వివాహమాడాలని కోరిక ఉంది. తమరు అనుగ్రహిస్తే కృతకృత్యుణ్ణవుతాను. తమకి ఏ కారణం చేత అయిష్టమైనా తెలియజెయ్యండి. మిమ్మల్ని సోదరిగానే భావిస్తాను. మీకు ఇల్లాగ ఉత్తరం రాసినందుకు అప్పుడు మాత్రం క్షమించండి. ఇలాగ రాశానని ఇంద్రుడుకైనా తెలియనియ్యకండా పొయ్యిలో పెట్టి కాల్చెయ్యండి. నేను అదృష్టానికి నోచుకోలేదని విచారిస్తా కాని మిమ్మల్ని వీధిని పెట్టి ఎంతమాత్రం అవమర్యాద చేస్తానని మాత్రం అనుమానపడనక్కర లేదు! అంటూ ఉంది. అదంతా వాడు ఇంగ్లీషువాళ్ళ పద్ధతిని నవలల్లో తెలుసుకున్న ప్రకారం రాశాడు. జవాబు మళ్ళా అపుస్తకంలోనే పెట్టి మర్నాడు ఇవ్వమని ఉంది.

అంబుజవల్లి మల్లెపూల తెప్ప కట్టుకుని తెప్ప మీద తేలిపోయింది. వాడు పన్నెండు పేజీల ఉత్తరం రాస్తే అది ఒక్కమాటే ఆలోచించి ఆలోచించి పావుటావు కాయితం మధ్యగా రాసి అడుగుని సంతకం చేసింది. మధుసూదనరావు అక్షరాలు అస్థైర్యంతో, భయంతో కొక్కిరిబిక్కిరై సహజమైన దస్తూరీకి దూరమై పోయిఉన్నాయి. అంబుజవల్లి రాసిన ఐదక్షరాలూ నిర్భయంగా నిబ్బరంగా శిలాక్షరాల లాగ కాయితం మధ్యగా ఉన్నాయి.

మర్నాడు మధుసూదనరావు చదువుతున్నాడు. అందులో ఏమి రాస్తుంది, ఏమి రాస్తుంది అని ఎదురుచూస్తున్న కళ్ళకి కాయితం బైట పడగానే పండో కాయో టకీమని తేలిపోయింది. అందులో ఏముంది?

'ధన్యురాలిని.
నీ అంబుజ...'

అని మాత్రమే ఉన్నది. అంబుజవల్లి ప్రేమ మధుసూదనరావుకి టెలిగ్రాములాగ అంది పోయింది.

అంబుజవల్లి తల్లికీ తండ్రికీ ఈ నిశ్చయం చెప్పలేదు. వాళ్ళని అడిగి ప్రయోజనం లేదని తెలుసుకున్నాకే ఈ ఉత్తరం మధుసూదనరావుకి రాసింది.

* * *

ఒకనాడు మాత్రం పొద్దున్నే తల్లీ తండ్రీ కాఫీ తాగుతున్నారు. తనూ తాగుతున్నది. అమ్మా అని అమ్మని, నాన్నా అని నాన్నని పిలిచింది. ఏమే అని నాన్న, ఎందుకే అని అమ్మా అడిగారు అంబుజవల్లి చెప్పింది.

'మీరు నన్ను క్షమించండి. పెంచి పెద్దదాన్ని చేశారు. మీ మాట జవదాటి ఎరగను మీతో విషయం చెపుతాను. మీరు నన్ను దీవించాలని కోరుతున్నాను. నేను ఇవాళ నా భర్తగారింటికి వెళ్ళిపోతున్నాను' అని చెప్పింది. వాళ్ళ కేమీ బోధపడక హడలెత్తిపోయారు. వాళ్ళ నాన్న న్నాడు:

'భర్తేమిటీ? వెళ్ళిపోవడమేమిటీ? పోయే కాలం ముందా?' అన్నాడు.

'నన్ను తిట్టకు నాన్నా. నేను పెళ్ళయిన పునిస్త్రీ నవుచును! నీకూతుర్ని. మధుసూదనరావు గారని ఒకాయన నాతో చదువుకొంటున్నారు. ఆయన్ని నేను నిన్న రిజిష్ట్రారుగారి దగ్గర పెళ్ళాడాను' అన్నది.

'నిజమే!' అన్నది తల్లి.

'నిజమే!' అన్నది అంబుజవల్లి.

అంతలో మధుసూదనరావు వచ్చాడు. 'మమ్మల్ని క్షమించండి! ఉభయులకీ నమస్కారం అని నమస్కారం చేస్తూ నేలమీద వాలాడు. తండ్రి డైలమ్మాలో పడి నిర్విణ్ణుడై కళ్లు తేలవేసుకు చూస్తున్నాడు. తల్లి ఆశ్చర్యంగా గుర్తించి

'శీఘ్రమే సుపుత్రా ప్రాప్తిరస్తు' అని దీవించింది.